

సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షునిగా కాండ్రేగుల నూకరాజు

విశాలాంధ్ర - మునగపాక: మునగపాక మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులుగా వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఎన్నికయ్యారు. ఆదివారం మునగపాకలో జరిగిన సమావేశంలో మండల సర్పంచ్‌లు అంతా పాల్గొని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కాండ్రేగుల నూకరాజు, ఉపాధ్యక్షులుగా చదరం గణేష్ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా సుందరపు తాతాజీ, కార్యదర్శిగా అయినంపూడి భాస్కరరాజు, సహాయ కార్యదర్శిగా కొరుకొండ వెంకటి, కోశాధికారిగా దిమ్మల అప్పారావు, సహాయ కార్యదర్శిలు భీశెట్టి గంగ అప్పలనాయుడు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పాలిపిని రమణమ్మ, ఇందుల హేమలత ఎన్నికయ్యారు.

అనకాపల్లి జిల్లా అభివృద్ధే ధ్యేయం

హైవేల విస్తరణకు త్వరలోనే టెండర్లు
మోడ్రన్ రైల్వే స్టేషన్‌గా అనకాపల్లి రైల్వే స్టేషన్
పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్

విశాలాంధ్ర - అనకాపల్లి: జిల్లా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ తెలిపారు. ఆదివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విశాఖ-విజయవాడ హైవేలో అనకాపల్లి నుంచి రాజమండ్రి వరకు ఆరు లైన్ల రహదారి మంజూరైనట్లు తెలిపారు. తుని నుండి నర్సీపట్నం, చోడవరం, మాడుగుల మీదుగా కొత్తవలస వరకు రహదారి కొరకు కేంద్ర మంత్రి నితిన్ సర్వే కోసం ఆదేశించినట్లు తెలిపారు. చోడవరం, మాడుగుల ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు అనువైన స్థలాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి రైల్వే స్టేషన్‌ను మోడ్రన్ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు పలు అంశాలు అభివృద్ధిపై పార్లమెంట్లో చర్చించినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, ప్రధాని చొరవతో ఎన్నికల ముందు చెప్పినట్లుగా సాధ్యమైందని ఆలస్యమైన న్యాయమే గెలుస్తుందని దీనికోసం పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్‌కు, గతంలో చంద్రబాబు ప్రయత్నం, ప్రధాని మాట, సుప్రీంకోర్టు తీర్పు ఇవన్నీ జరగటం మంచి పరిణామం అన్నారు. అనకాపల్లి నుండి రాజమండ్రి వరకు ఆరు లైన్ల రహదారి మంజూరు అయిందని ఈ నెలాఖరులోనే టెండర్లకు ఆహ్వానం పలుకుతామన్నారు. ఆరు లైన్ల రహదారిలో ఎక్కడ డైవర్షన్స్ లేకుండా సెకన్ ఆలస్యం కాకుండా పట్టణాలు దగ్గర సర్వీస్ రోడ్డులతో అత్యాధునికంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. తుని నుండి నర్సీపట్నం, చోడవరం, మాడుగుల మీదగా కొత్తవలస వరకు నేషనల్ హైవేకు సమాంతరంగా మరో కొత్త రోడ్డు ప్రతిపాదనకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఆదేశించారని తెలిపారు. ఈ రహదారి ఏర్పాటు అయితే పారిశ్రామికంగా అనకాపల్లి జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ఆర్థిక సంవత్స రంలో అవ్వకపోయినా వచ్చే ఆర్థిక సంవత్సరంలోపు నిధులు మంజూరు చేయించేలా కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో రోడ్ల విస్తరణ, కొత్త గ్రీన్ ఫుల్ రోడ్లు, కనెక్టివిటి రోడ్ల మీద పూర్తిగా దృష్టి సారించిందని అన్నారు. పార్లమెంట్‌లో రైల్వే మినిస్టర్‌ని స్వయంగా కలవడం జరిగిందని అనకాపల్లి, ఎలమంచిలి, తుని రైల్వే స్టేషన్‌లో హాల్ట్ గురించి వారిని కోరడం జరిగిందని ముఖ్యంగా పాయకరావుపేట నియోజకవర్గంలో తమల పాకులు వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయని వారి అవసరాల నిమిత్తం కొన్ని దూర ప్రాంతాలకు వెళ్లే రైలు స్థానికంగా ఆగేలా స్టాపుల కోసం కేంద్ర మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనకాపల్లి రైల్వే స్టేషన్ గురించి పార్లమెంట్‌లోనే అడగడం జరిగిందని అనకాపల్లి రైల్వే స్టేషన్‌ని మోడరన్ రైల్వే స్టేషన్‌గా మారుస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కేంద్ర మంత్రి తనను స్వయంగా పిలిచి జిల్లా పరిధిలో ఉన్న రైల్వే స్టేషన్లో సదుపాయాల నిమిత్తం వివరాలు కోరగా సొంతంగా ఒక కన్సల్టెన్సీ వారిని నియమించి ప్రణాళికలు సిద్ధం చేసి పూర్తి నివేదిక సిద్ధం చేసి అందజేయాలని వారికి తెలియజేసామన్నారు. గత పర్యటనలో అనకాపల్లి జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి చోడవరం, మాడుగుల నియోజవర్గంలో సెజ్‌లు ఏర్పాటు కొరకు దాదాపు 5000 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు ఉండేలా చూడాలని చెప్పగా దానికి అనుగుణంగా స్థలాలు పరిశీలన జరుగుతుందని తెలిపారు. సెజ్ ఏర్పాటు జరిగితే విశాఖ చెన్నై కారిడార్‌తో సమాంతరంగా ప్రాంతం అంతా అభివృద్ధి చెందుతుంది అని అన్నారు. మరికొన్ని రోజుల్లో అనకాపల్లి వరకు పోలవరం నీళ్లు తీసుకువచ్చేలా ప్రణాళికలను రూపొందించాలని టెండర్లు పిలువునకు సిద్ధం చేయాలని ఆదేశించామని అన్నారు. ఉత్తరాంధ్ర సుజల ప్రవంతి కొరకు కేంద్రం నుండి గాని లేక వివిధ శాఖల ద్వారా నిధులు సమీకరించి వచ్చే రెండు, మూడు ఏళ్లలో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు చేశానని. వారు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు సుముఖంగా ఉన్నారని ముఖ్యంగా హైడ్రోజన్ గ్రీన్ అమోనియా పరిశ్రమలు తీసుకువచ్చేలా చర్చలు జరుపుతున్నామని పరిశ్రమలకు అనుకూలమైన ప్రాంతం, దానికి తోడుగా ఎక్కువ మంది ఉపాధి పొందవచ్చు అని తెలిపారు. చైనా దేశంలో ఒక ప్రాంతమంతా ఫర్నిచర్ హబ్‌గా ఎలా అయితే ఉందో అదేవిధంగా అనకాపల్లి ప్రాంతంలో ఫర్నిచర్ జోన్ క్లస్టర్ ఏర్పాటు చేస్తే అనేకమంది యువతకు ఉద్యోగ అవకాశం కల్పించే అవకాశం ఉంటుందన్నారు. గత కొన్ని రోజులుగా వర్షాలు కారణంగా జిల్లాలో పలు రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని తక్షణమే రోడ్ల బాగు కొరకు డిజాస్టర్ మేనేజ్మెంట్ ద్వారా నిధులు కేటాయించడం జరుగుతుంది అన్నారు. రోడ్ల అభివృద్ధి కొరకు గత ప్రభుత్వం న్యూ డెవలప్మెంట్ ద్వారా 4 వేల కోట్లకు గాను వారు మొదటి విడతగా ప్రభుత్వానికి 400 కోట్ల రూపాయలు ఇస్తే కాంట్రాక్టర్లకు చెల్లించకుండా నిధులన్నీ దారి మళ్లించారన్నారు. గత నాలుగేళ్ల పనులు చేయకుండా ఉండటం వల్ల మరింత అధ్వాన్నంగా రోడ్లన్నీ తయారయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రబాబు న్యూ డెవలప్మెంట్ వారితో రెన్యువల్ గురించి కోరగా సాధ్యాసాధ్యాలను పరిశీలించి అధికారులతో చర్చించి తెలియజేస్తామని అని న్యూ డెవలప్మెంట్ వారు తెలిపారన్నారు. ఢిల్లీలో స్వయంగా న్యూ డెవలప్మెంట్ వారితో నేను చర్చించానని వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రస్తుత రోడ్డు మరమ్మతుల నిమిత్తం, వర్షాలు కారణంగా వివిధ రోడ్లు అధ్వానంగా తయారైన నేపథ్యంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ ద్వారా నిధులు కేటాయించాలని కలెక్టర్‌కి అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. విశాఖపట్నం ఎయిర్పోర్ట్ నుండి అనకాపల్లికి నేరుగా రావడానికి ఆరు లైన్ల రహదారి ఏర్పాటు కొరకు దాదాపు 9 ఫ్లైఓవర్లు నిర్మించేలా నివేదిక తయారైందని దాదాపు 1200 కోట్ల రూపాయలతో వచ్చే వారం రెండు వారలలోపు టెండర్లు పిలుపు కొరకు ఆలోచన చేస్తున్నామన్నారు. పార్లమెంట్లో జరిగిన రెండు సమావేశాలు మన అనకాపల్లి జిల్లాకు ఎంతగానో తోడ్పడ్డాయని తెలియజేశారు. కూటమి తరపున తెలుగుదేశం నుండి అభ్యర్థి బరిలో ఉంటారని కార్యాలయంలో కూటమి నాయకులతో చర్చలు జరిపామని రేపటిలోగా ముఖ్యమంత్రి చంద్రబాబు అభ్యర్థి పేరు ప్రకటిస్తారని తెలియజేశారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు దాడి రత్నాకర్, బిజెపి నాయకులు పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడికలు తొలగించాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు

విశాలాంధ్ర - మునగపాక: శారదానది ఆయకట్టుకు నీరందించే విధంగా కాలువల్లో పూడికలు తీయించి, ఆక్రమణలు తొలగించేలా అధికారులపై ఒత్తిడి తేవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. సీపీఐ మునగపాక మండల సమితి సమావేశం ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ ఆడారి రామారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముందుగా ఇటీవల కేరళ రాష్ట్రం వయనాడ్‌లో సంభవించిన వరదల బీభత్సానికి కొండచరియలు విరిగి పడడంతో సుమారుగా మరణించిన 300 మందికి సంతాపాన్ని ప్రకటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ మునగపాక, నాగులాపల్లి, ఉమ్మలాడ, ఒంపోలు, అరబుపాలెం తదితర గ్రామాల్లో రైతులు, రైతు సంఘాలతో కలిసి సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాడాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై చర్చించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఖచ్చితంగా అమలు జరిపేలా ప్రభుత్వంపై ఎప్పటికప్పుడు ఒత్తిడి చేస్తూ ప్రజల్ని సమీకరించాలని నిర్ణయించారు. ఈనెల 6న నర్సీపట్నంలో జరిగే సీపీఐ జిల్లా సర్వసభ్య సమా వేశానికి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రామకృష్ణ హాజరు కాను న్నారని తెలిపారు. సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు మునగపాక మండల కార్యదర్శి కామ్రేడ్ మళ్ళ మాధవరావు, కామ్రేడ్స్ పెంటకోట సత్యనారాయణ, దాడి శివరాం, నరాల శెట్టి సత్యనారాయణ, కొంత జగదీశ్వరరావు పాల్గొన్నారు.

పోరాట యోధుడు ఎగ్గాడ నాగేశ్వరరావు

విశాలాంధ్ర - అనకాపల్లి: దళిత బహుజన హక్కుల కోసం నిరంతరం పనిచేసిన పోరాటయోధుడు కామ్రేడ్ ఎగ్గాడ నాగేశ్వరావు అని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఐ.ఆర్.గంగాధర్ అన్నారు. ఆదివారం మండలంలోని లోవేట జంగాలపాలెం గ్రామంలో జరిగిన ఎగ్గాడ నాగేశ్వరరావు 23వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ ఎగ్గాడ నాగేశ్వరరావు తన జీవితాన్ని బహుజన వర్గాల అభ్యున్నతి కోసం వెచ్చించారని కొనియాడారు. నాగేశ్వరరావు పిన్నవయసులోనే అశువులు బాసారని గంగాధర్ ఆవేదన వ్యక్తం చేశారు. నాగేశ్వరరావు ఆశయాల సాధన కోసం ఆయన అభిమానులు పనిచేయాలని గంగాధర్ కోరారు.

దేశంలో సెక్యులర్ శక్తులు ఏకం కావలసిన అవసరం నేటి బహుజనంపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వేట జంగాల పాలెం మాజీ సర్పంచ్ పూడి చిన్నారావు, యువజన కాంగ్రెస్ నాయకుడు కొల్లి సత్యారావు, గ్రామ పెద్దలు బండి రాము, ఎడువాకుల దేవుడమ్మ, ఎగ్గాడ జాన్‌పాల్, ఎగ్గాడ సత్తిబాబు పాల్గొన్నారు.

గిరిజన యువకుడు అదృశ్యం

విశాలాంధ్ర - రావికమతం: మండలం చీమలపాడు శివారు దూకులంపాడు గ్రామానికి చెందిన గిరిజన యువకుడు అదృశ్యం అయ్యాడు. ఈ ఘటనపై కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు కథనం మేరకు దూకులంపాడు గ్రామానికి చెందిన ఈదల చిన అప్పారావు ఉరఫ్ సంజీవి(35) శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడని, ఆదివారం మధ్యాహ్నం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో యువకుని సోదరి గద్దమ్మ ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు. యువకుడు చిన అప్పారావు గ్రామ సమీపంలో కల్యాణపులోవ జలాశయంలో తరచూ చేపల వేటకు వెళ్తున్నట్టు తమ దర్యాప్తులో తేలిందన్నారు. యువకుడు వాడిన నాటు పడవ (దోనే)లో తన చేతి తువ్వాలు, కత్తి ఉన్నాయని చెప్పారు. జలాశయంలో ప్రమాదవ శాత్తు ఏమైనా జారి పడిపోయాడా లేక ఏమైనా జరిగిందా అన్నది తెలియాల్సి ఉందన్నారు. ఘటనా స్థలంలో గజ ఈత గాళ్ళు, ఫైర్ సిబ్బందితో ఆచూకి కోసం ప్రయత్నం చేశామన్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో యువకుడు చిన అప్పారావు అదృశ్యంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం ఉదయం ఇదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు జలాశయం వైపు చిన అప్పారావు తీసుకు వెళ్లారని వారి మధ్య గతంలో జరిగిన తగాదాలను దృష్టిలో పెట్టుకొని చిన అప్పారావును ఏదో చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఘనంగా కేజె.పురం మోదకొండమ్మ జాతర

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం కేజే.పురం గ్రామంలో ఆదివారం శ్రీ మోదకొండమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీ చైర్మన్, ఎంపీటీసీ భీశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి భక్తులు భారీ ఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గంగాలమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

విశాలాంధ్ర - మునగపాక: మండలంలో మూలపేట గ్రామంలో శ్రీ గంగాలమ్మ ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. దీనిలో భాగంగా మునగపాక గ్రామానికి చెందిన స్వర్గీయ పెంటకోట జోగినాయుడు జ్ఞాపకార్థం వారి కుమారులు పెంటకోట జోగి అప్పల నాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ రూ. 10,155 విరాళాన్ని అమ్మవారి ఆలయ నిర్మాణ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో మూలపేట గ్రామ సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో కృష్ణ దేవి పేట గ్రామం శివాలయం ఆలయం వద్ద సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కృష్ణదేవిపేట వెటర్నరీ వైద్యాధికారి శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పశు వైద్య శిబిరంలో పశువులకు సోకే వివిధ రకాల వ్యాధులకు మందులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. అలాగే పెంపుడు జంతువులకు కూడా వైద్యం చేయబడుతుందని ఈ సందర్భంగా డాక్టర్ శిరీష తెలియజేశారు. ఈ అవకాశాన్ని సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర - అనకాపల్లి: భవన నిర్మాణ కార్మిక సంఘ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులను ఆదుకోవాలని అనకాపల్లి సర్వకామాందా పార్క్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు వైఎన్ భద్రం మాట్లాడుతూ గత ప్రభుత్వం సంక్షేమ బోర్డు పథకాలను పూర్తిగా నిలపుదల చేసి బోర్డులో ఉన్న కార్మికుల సొమ్ము నిధులు మళ్లించడం ద్వారా ప్రభుత్వ అవసరాలు తీర్చుకుందని, సుమారు ఏడు సంవత్సరాలుగా చనిపోయిన భవన నిర్మాణ కార్మికులకు చెల్లించాల్సిన బీమా పరిహారం చెల్లించలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 44 వేల క్లైములు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే కూటమి ప్రభుత్వం పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మహిళ కార్మికులకు అందాల్సిన ప్రసూతి ఖర్చులు, పిల్లల వివాహ కానుకలు వేల సంఖ్యలో నిలిపివేయబడ్డాయన్నారు. వీటన్నింటినీ చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ తీసుకురావడం వల్ల ఇసుక ధరలకు రెక్కలు వచ్చాయని దాంతో నిర్మాణరంగం పూర్తిగా కుదేలైపోయి కార్మికులకు పని లేకుండా పోయిందన్నారు. వెంటనే కరోనా వ్యాధి సోకి వేలాదిమంది చనిపోగా ఆ ప్రభావం కూడా నిర్మాణ రంగాన్ని కుదేలు చేసిందని విమర్శించారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక సప్లయి చేస్తామని వాగ్దానం చేసిందని కానీ జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో ఇసుక ర్యాంపులు ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. అనకాపల్లికి నక్కపల్లి నుండి ఇసుక తెచ్చుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ ఇసుక 6000 ఉండగా ప్రస్తుతం ఆ ధర 9,000కు చేరడం కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన కానుకగా ఉందని శ్రీరామదాసు అబ్బులు ఎద్దేవా చేశారు. స్థానిక పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు కలుగచేసుకుని అనకాపల్లి పట్టణానికి అతి సమీపంలో ఇసుక ర్యాంకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు మొల్లేటి ఈశ్వరరావు అధ్యక్షతన జరుగగా మద్దాల నూకేష్, చిన్ని సత్తిబాబు, చిన్ని శ్రీను, కరోతి శ్రీను, చిన్ని చిన్న పాల్గొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా నాయకులు శ్రీరామదాసు అబ్బులు, తాకాసి వెంకటేశ్వరరావు, కోరుబిల్లి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఓనస్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర - పరవాడ: ఓనస్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. ఫౌండేషన్ మూడో వార్షికోత్సవం సందర్భంగా వెన్నెలపాలెం మండల ప్రజాపరిషత్ పాఠశాలలో ఆదివారం మెడికల్ అండ్ బ్లడ్ డొనేషన్ క్యాంపుని నిర్వహించారు. బండారు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సేవలను ఆయన కొనియాడారు. ప్రజలకు మంచి చెయ్యాలనే ఆలోచన రావటం గొప్ప విషయమన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకి తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం స్నేహితుల దినోత్సవానికి గుర్తుగా మొక్కని నాటారు. కాగా ఈ మెడికల్ క్యాంపులో సుమారు 300 మంది వైద్య సేవలు వినియోగించుకోగా, 82 మంది బ్లడ్ డొనేట్ చేసినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పైల సన్యాసిరావు, పైల వరలక్ష్మి, గొంప మారు నాయుడు, బండారు వీరునాయుడు, లోకిరెడ్డి అభినాయుడు, వెన్నెల గిరి, పైల ప్రసాద్, బోజంకి అప్పలనాయుడు, వెన్నెల ప్రసాద్, వెన్నెల నర్సింగరావు, జై హనుమాన్ యూత్, బండారు యువసేన, ఓనస్ ఫౌండేషన్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎల్ పురంలో మరిడిమాంబను దర్శించుకున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు

విశాలాంధ్ర - గొలుగొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ నర్సీపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో గొలుగొండ మండలం ఏఎల్ పురం గ్రామంలో మాజీ జెడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్ ఆధ్వర్యంలో టీడీపీ కూటమి కుటుంబ సభ్యులు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు గ్రామంలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశాఖపట్నం మెడికవర్ హాస్పిటల్ వైద్యులచే ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపులో డెంటల్, గుండెకు సంబంధించిన శిబిరాలను సందర్శించి డాక్టర్లతో మాట్లాడారు. అనంతరం టీడీపీ పార్టీ శ్రేణులతో ఆనందంగా గడిపి సెల్ఫీలు ఫోటోలకు అధిక సమయం కేటాయించారు. అదేవిధంగా ఐదువేల మందికి భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండియన్ నేవీ బాక్సింగ్ ట్రైల్స్‌కి ప్రశాంతి విద్యార్థి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: ఇండియన్ నేవీ బాక్సింగ్ ట్రైల్స్‌కి స్థానిక ప్రశాంతి జూనియర్ కాలేజ్ ఎన్‌సిసి కెడేట్ విద్యార్థి ఎ.ధనుష్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అప్పల నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ నేవీ చీఫ్ పెట్టీ ఆఫీసర్‌కి బాక్సింగ్ కోటాలో జరిగే ట్రైల్స్‌కి ఎంపిక య్యాడని, ఆగస్ట్ 13వ తేదీన ముంబాయి ఐఎన్ఎస్ హాంలాలో జరిగే ఈ పోటీలలో దనుష్ ప్రతిభ కనబరిస్తే ఇండియన్ నేవీలో నేరుగా ఉద్యోగం పొందుతాడన్నారు. విశాఖపట్టణం గ్రూపు నుండి ప్రతిభ కనబర్చిన దనుష్‌ని ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ దర్మిరెడ్డి ప్రసాద్ అభినందించారు.

స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని ధర్మవరం జాతీయ రహదారి పక్కన రొయ్యల పరిశ్రమ వద్ద గత కొద్ది రోజులుగా తొలగించిన స్తంభాలను తీయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజుల క్రితం విద్యుత్ శాఖ అధికారులు పాత స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఇవ్వడం జరిగింది. అయితే ఆ పాత స్తంభం రోడ్డు పైకి వచ్చే విధంగా అక్కడే ఉంచేశారు. ద్విచక్ర వాహనదారులు రోడ్డు పక్కకు వచ్చే సమయంలో ఈ స్తంభం చూసి కొంచెం ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం అధికారులు స్తంభాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

బురదమయంగా రహదారి

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని ఎస్.రాయవరం, కర్రివానిపాలెం గ్రామాల సమీపంలో రోడ్డు బురదమయంగా తయారైంది. ఇటీవల జల జీవన్ మిషన్ పథకం త్రాగునీరు పైప్ లైన్ నిమిత్తం కాంట్రాక్టర్ రోడ్డు పక్కన కాలువ తవ్వుకుంటూ పైపు వేయడం జరిగింది. అయితే తవ్విన మట్టి రోడ్డుపై పూర్తిస్థాయిలో తీయకపోవడంతో చిన్నపాటి వర్షానికి రోడ్డు బురదగా తయారైంది. దీనివల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేసేటప్పుడు మట్టిని తొలగించకపోవడం వల్లే ఈ బురద రావడం జరుగుతుందని పలువురు విమర్శిస్తున్నారు.

విశాలాంధ్ర
పేజి :
అనకాపల్లి
సోమవారం 5, ఆగస్టు, 2024

జోరుగా హుషారుగా
స్నేహితుల దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - అనకాపల్లి: స్నేహితుల దినోత్సవ వేడుకలు ఆదివారం జోరుగా హుషారుగా జరిగాయి. తమ వయసును సైతం మరచిపోయి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ స్నేహితులు ఆనందంగా ఆటపాటల మధ్య దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు.

జార్జ్ క్లబ్ షటిల్ హబ్ ఆధ్వర్యంలో

కుల మతాలకతీతంగా, పండిత, పామర తేడా లేకుండా అన్ని బంధాల కన్నా మధురమైన బంధం స్నేహబంధం అని జార్జి క్లబ్ పెద్దలు డాక్టర్ కే.విష్ణుమూర్తి, దంతులూరి దిలీప్ కుమార్, కొణతాల మురళీకృష్ణ, బుద్ధ శివ పేర్కొన్నారు. పట్టణంలోని జార్జ్ క్లబ్ షటిల్ హబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు ఒకరికొకరు పంచుకొని ఆలింగనాలు కరచాలనాలతో, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకొని హ్యాపీ ఫ్రెండ్ షిప్ డే అంటూ స్లోగన్స్‌తో ఆ ప్రాంతమంతా ఆహ్లాదకర, స్నేహ పూరిత వాతావరణాన్ని నింపారు. ఈ సందర్భంగా క్లబ్ పెద్దలు డాక్టర్ కే.విష్ణుమూర్తి, దంతులూరి దిలీప్ కుమార్, కొణతాల మురళీకృష్ణ, డాక్టర్ నారాయణరావు, బుద్ధ శివ తదితరులు మాట్లాడుతూ స్నేహ బంధానికి ప్రతీక శ్రీకృష్ణ, కుచేల స్నేహం అన్నారు. అదేవిధంగా, కర్ణ, దుర్యోధనుల స్నేహాన్ని మర్చిపోకూడదు అన్నారు. రక్త సంబంధాన్ని బంధువులను ఆ దేవుడు మనకు ఇస్తాడని, కానీ మంచి స్నేహితులను సంపాదించుకోవడం మన పని అన్నారు. ఎందుకంటే మనకు సంబంధించిన ఏ విషయం అయినా అన్నదమ్ములతో కానీ, కట్టుకున్న భార్యతో కానీ చెప్పుకోలేనివి కూడా ఒక్క స్నేహితుడికి మాత్రమే చెప్పుకుంటామని కాబట్టి మన మనసెరిగిన స్నేహితులు దొరకడం మన అదృష్టమని, అలాంటి వారిని సంపాదించుకోవడం ఒక వరమని అన్నారు. ఈరోజు ఇలా మనందరినీ ఒక చోటకు చేర్చి ఈ కార్యక్రమం నిర్వహించిన ప్రతి ఒక్కరికి అభినందనలు అన్నారు. మరొకసారి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు అని తెలిపారు. ఈ వేడుకలలో క్లబ్ అధ్యక్షులు బిఎస్ఎంకె జోగినాయుడు, కార్యదర్శి బుద్ధ కాశి విశ్వనాథం, మాస్టర్ కోశాధికారి వి. చంద్రశేఖర్, ఆళ్ళ రామచంద్రరావు, హావెల్స్ బాబు, కుమార్, దాడి ఈశ్వరరావు, పోలారపు త్రినాధరావు, ఆళ్ళ రామకృష్ణ, దొడ్డి రవి, పి.రవికుమార్, పి.సుబ్రహ్మణ్యం, కే.కన్నబాబు, పి.రామకృష్ణ, ఎస్.ఎం.నాయుడు, జి.అప్పారావు, సుబ్బరాజు, కొణతాల ఈశ్వరరావు, ఎం.సుబ్బరాజు, ఆడారి శ్రీనివాసరావు, పి.ప్రసాద్, కే.ప్రసాద్, బి.దేవరాజ్, ఎం.సూర్య ప్రకాష్, క్లబ్ మేనేజర్ సీతారాం, అధిక సంఖ్యలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ గవరపాలెం హైస్కూల్ పూర్వపు విద్యార్థులు

స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఎంజీహెచ్ స్కూల్ 91 - 92 బ్యాచ్ టెన్త్ క్లాస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం స్థానిక తోటాడ రోడ్‌లో గల కాండ్రేగుల నాయుడు లేఔట్‌లో అత్యంత అట్టహాసంగా జరిగింది.. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి సుమారుగా 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమతో చదువుతున్న మిత్రుల పిల్లలు చదువులో ఉన్నత స్థాయిలో మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ ప్రోత్సాహక అవార్డు, నిమిత్తం, కోవిడ్ సమయంలో మిత్రుడు దొడ్డి ఉమా ని కోల్పోయాము వారి కుమార్తెలకు ఆర్థిక సహాయం డిపాజిట్ ద్వారా 50వేల రూపాయలు విల్లూరి పరమేశ్వరరావు ద్వారా సహాయం చేయటం జరిగింది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ వేడుకల్లో ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా స్నేహితుల్లో కొంతమంది ఉన్నత శిఖరాలు చేరిన వారిని సత్కరించడం అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా మిత్రులందరితో కలిసి మరింత విస్తృతమైన సేవా కార్యక్రమాలతో ముందుకెళ్లాలని నిర్ణయించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఒకరికొకరు ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టుకొని చాలా ఆనందంగా, ఉల్లాసంగా స్నేహితుల దినోత్సవం జరుపుకోవడం జరిగింది. స్నేహితుడు అన్నవాడు చిరకాలం మనతోటి ఉండి మన వెన్నంటే ఉండి మన అభివృద్ధిని మన భవిష్యత్తుని ఆకాంక్షిస్తాడు కాబట్టి స్నేహితుడిని ప్రాణాలు ఉన్నంతవరకు కూడా స్నేహభావం పెంపొందించుకోవాలని అన్నారు. 91-92 విద్యార్థులు పదవ తరగతి చదివిన తర్వాత 33 సంవత్సరాలు అయిన సందర్భంగా ఈ రకంగా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. 91-92లో 10వ తరగతి మున్సిపల్ గవరపాలెం హై స్కూల్ చదువుతున్న విద్యార్థులు అందరూ కూడా మరింత సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్లడం కోసం మిత్రుల ఒకరైన సూరిశెట్టి గణేష్ 50 వేల రూపాయలు తన వంతు సహాయంగా ప్రకటించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల జగన్నాధరావు, కొణతాల అప్పలరాజు, పీలా రాముడు, కొణతాల గంగాధర్, కట్టా సాయి, కోరిబిల్లి రమేష్, కృష్ణంరాజు, కర్రి గంగాధర్, పెంటకోట బలరాం, బివిఎస్ అప్పారావు, దువ్వాడ గణేష్, షణ్ముఖ స్వీట్స్ భాను, రాము, ఇతర స్నేహితులూ పాల్గొన్నారు.

మిత్రమా కుశలమా సినిమా సంస్థ ఆధ్వర్యంలో

అనకాపల్లిలోని సత్యనారాయణ స్వామి కొండ వద్ద స్నేహితుల దినోత్సవ సంబరాలు అట్టహాసంగా, కోలాహలంగా జరిగాయి. వీరందరూ 85 - 86 సంవత్సరంలో స్థానిక మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతి చదివిన వీరంతా స్నేహితుల దినోత్సవ వేడుకలు జరిపారు. మిత్రుడైన అద్రట శ్రీనివాసు కిడ్నీ వ్యాధితో మరణించడంతో వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడం కోసం సంస్థ తరపున ఒక లక్ష రూపాయలు చెక్కును మిత్రమా కుశలమా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి పిఎల్ నారాయణ, ట్రెజరర్ పలక నాగేశ్వరరావు వారి మిత్రుల బృందం సహాయంతో అందజేశారు. ఈ సంవత్సరం అనకాపల్లి స్మార్ట్ సిటీ టీం ఇతివృత్తంగా 10,000 మందితో ఒక రన్ కార్యక్రమాన్ని డిసెంబర్ నెలలో నిర్వహించాలని తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంద్రా శ్రీనివాసు, కే శ్రీనివాస్, బి.శ్రీనివాస్, సిరసపల్లి ప్రసాదు, వజ్రపు త్రినాథ్, ఎస్.విజయ్ కుమార్, తిమ్మాపాత్రీని గణేష్, ఆర్వి నాయుడు, సూరి దేముల్లు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ అనకాపల్లి వారి ఆధ్వర్యంలో

ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. రింగ్ రోడ్డు జంక్షన్ నుండి లాంగ్ వాక్ పోటీలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ట్రాఫిక్ సిఐ పైడపు నాయుడు పాల్గొని పోటీలను ప్రారంభించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఎన్టీఆర్ వంద పడకల ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టు బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు పాలకవర్గ సభ్యులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షులు పెంటకోట నర్సింగరావు, చైర్మన్ పిఎస్ అప్పారావు, అధ్యక్షులు బిఎస్ఎంకె జోగినాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి బర్రికలు శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు మోదకొండమ్మను దర్శించుకున్న కర్రి సాయికృష్ణ

విశాలాంధ్ర - మునగపాక: పాడేరులో వెలసిన శ్రీ మోదమాంబ అమ్మవారిని ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ దర్శించుకున్నారు. దర్శనానంతరం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు, ఐటీడీపీ పాడేరు నియోజకవర్గ అధ్యక్షుడు జ్యోతి కిరణ్ సాయికృష్ణని సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసారు. సాయికృష్ణ వెంట పెంటకోట విజయ్, విల్లూరి సాయిరామ్, పెంటకోట శ్రీరామమూర్తి, ఆడారి కన్నారావు, వేగి దేవత నాయుడు, పెంటకోట కళ్యాణ్, విల్లూరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల జనసేన పార్టీ టౌన్ కమిటీ మార్పు చేయాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల జనసేన పార్టీ టౌన్ కమిటీని మార్పు చేయాలని నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ రాయపురెడ్డి కృష్ణ, జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బ మహేష్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు గట్రెడ్డి శివాజీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనసైనికులు మాట్లాడుతూ గతంలో నియమించిన కమిటీని సభ్యులు రాజీనామా చేశారని, కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని వారిని కోరారు. వైస్ ప్రెసిడెంట్ రాకేటి నూకరాజు, జాయింట్ సెక్రెటరీ వేపాడ నాగు, కోశాధికారి ధర్మిశెట్టి అప్పారావు, కోళ్ల చిన్న,నూకరాజు, రాజేష్, మంచాల శివ, బలిరెడ్డి సత్తిబాబు పలువురు జనసైనికులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

విశాఖ రైల్వే స్టేషన్లో అగ్ని ప్రమాదం
రైల్వే బోగీలలో చెలరేగిన మంటలు